# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :16 31-07- 2026 శుక్రవారం పేజీలు: 4 వెల:03/-



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో





- ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రహ్మపుత్ర.. లక్షలాది మంది వరద ముంపులో
- సహాయక చర్యలు ముమ్మరం.. మరో రెండు రోజులు భారీ వర్షాల హెచ్చరిక

గువాహటి, జూలై 30: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న రుతుపవన వర్షాలు, బ్రహ్మపుత్ర నది ఉధృతంగా ప్రవహించడంతో అస్సాం రాష్ట్రం మరోసారి భారీ వరదల బారిన పడింది. రాష్ట్రంలోని అనేక జిల్లాలు జలమయమవగా, లక్షలాది మంది ప్రజలు వరద ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందలాది గ్రామాలు ముంపునకు గురికావడంతో వేలాది కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలించబడ్డాయి.

వరదల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోగా, భారీ సంఖ్యలో పశువులు కూడా వరద నీటిలో చిక్కుకున్నాయి. వేలాది ఇళ్లు దెబ్బతినడంతో ప్రజలు సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో రవాణా వ్యవస్థ దాదాపు స్తంభించింది. పలు ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, సైన్యం సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. పడవలు, హెలికాప్టర్ల సహాయంతో వరదల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ ఆహారం, తాగునీరు, మందులు అందజేస్తున్నారు. సహాయక శిబిరాల్లో వేలాది మంది ఆశ్రయం పొందుతున్నారు.

ఇక మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. బ్రహ్మపుత్రతో పాటు ఇతర నదుల నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ప్రకృతి వైపరీత్యంతో అస్సాంలో సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. పంట పొలాలు నీట మునగడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తున్నాయి.

## విద్యా రంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం




హైదరాబాద్, జూలై 30:
విద్యా రంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్య పూర్తి చేసిన విద్యార్థులను నైపుణ్యాల (స్కిల్స్) వైపు మళ్లించే విధంగా విద్యా వ్యవస్థను రూపుదిద్దుతున్నామని తెలిపారు.

ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా అధ్యయన పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన ఉపాధ్యాయ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ దాశరథి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్ తరాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలను అడగకుండానే ప్రభుత్వం పరిష్కరిస్తుందని, బదిలీలు, ప్రమోషన్లు సహా అన్ని అంశాల్లో పూర్తి బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంచిన సమస్యలను పరిష్కరిస్తూ ఇప్పటికే 23 వేల మందికి ప్రమోషన్లు, 30 వేల మందికి పైగా ఉపాధ్యాయులకు పారదర్శకంగా బదిలీలు చేపట్టామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 11 వేల ఉపాధ్యాయ పోస్టులను

3

## విపక్షాల ఆందోళనల మధ్య లోక్‌సభలో 'వందేమాతరం' బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 30 (బ్యూరో):
జాతీయ గేయమైన 'వందేమాతరం'కు చట్టబద్ధమైన రక్షణ కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లిలి'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్స్ టు నేషనల్ హానర్ (సవరణ) బిల్లు--2026'కు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. అంతకుముందే ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించడంతో, ఇప్పుడు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పూర్తయింది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం బిల్లు చట్టంగా అమల్లోకి రానుంది.




పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా విపక్ష సభ్యుల నిరసనలు, నినాదాల మధ్య బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం మూజువాణి ఓటుతో బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా ప్రస్తుతం జాతీయ గీతం లిలి'జనగణమన'లిలి, జాతీయ పతాకం, రాజ్యాంగానికి ఉన్న చట్టపరమైన రక్షణను జాతీయ గేయం లిలి'వందేమాతరం'లిలికు కూడా విస్తరించనున్నారు.

కొత్త నిబంధనల ప్రకారం వందేమాతరం గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం, ఆలాపన సమయంలో కావాలనే ఆటంకం కల్పించడం లేదా గేయం గౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. ఇటువంటి ఉల్లంఘనలకు గరిష్టంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.

బిల్లుపై జరిగిన చర్చలో అధికార పక్షం మాట్లాడుతూ, బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని పేర్కొంది. జాతీయ గేయానికి తగిన గౌరవాన్ని చట్టపరంగా కల్పించడం దేశ సమగ్రతకు, జాతీయ భావాలకు

2

## అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వినియోగించొచ్చు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 30 (బ్యూరో):
ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం ఏర్పడిన అసాధారణ పరిస్థితుల్లో పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగించేందుకు చట్టబద్ధమైన అధికారం ఉందని ధర్మాసనం పేర్కొంది. అయితే అలాంటి చర్యలు అత్యంత అరుదైన, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది.



జంతర్ మంతర్ ఘటనలో పోలీసుల చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల బాధ్యతేనని, పరిస్థితులను బట్టి తగిన నిర్ణయం తీసుకునే అధికారం వారికి ఉంటుందని తెలిపింది. అదే సమయంలో బలప్రయోగం చట్టబద్ధంగా, అవసరానికి అనుగుణంగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించింది.

జంతర్ మంతర్ ఘటనలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (=ూఖీ) వినియోగించిన మందుగుండు సామగ్రికి సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఘటనకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

పెల్లెట్ గన్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్న అభ్యర్థనపై తుది నిర్ణయం తీసుకోకుండా, తదుపరి విచారణలో అన్ని అంశాలను పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన హక్కు అయినప్పటికీ, శాంతిభద్రతల పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి ప్రభుత్వం కసరత్తు

హైదరాబాద్, జూలై 30 (బ్యూరో):
రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్ (ఆయా) పోస్టుల భర్తీ ప్రక్రియను మహిళా, శిశు సంక్షేమ శాఖ వేగవంతం చేసింది. జిల్లాల వారీగా ఖాళీల వివరాలను ఖరారు చేస్తూ దశలవారీగా నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఖాళీల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు, రోస్టర్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన సిబ్బంది నియామకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాల వారీగా ఖాళీలను గుర్తించి, అర్హులైన మహిళలకు అవకాశం కల్పించేలా నియామకాలు చేపడుతున్నారు.




ఇప్పటికే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్లు జారీ కాగా, మిగిలిన జిల్లాల్లో కూడా దశలవారీగా ప్రకటనలు వెలువడనున్నాయి. అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, ఖాళీల వివరాలను ఆయా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాలు అధికారికంగా ప్రకటించనున్నాయి.

అంగన్‌వాడీ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది మహిళలకు ఈ ప్రక్రియతో ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు.

## 'బీజేపీలో చేరకపోతే చంపేస్తామంటూ బెదిరింపులు: సీజేపీ చీఫ్ అభిజీత్ ఆరోపణలు'

### కేంద్ర ప్రభుత్వంపై, విద్యార్థుల ఉద్యమాల అణచివేతపై తీవ్ర విమర్శలు




న్యూఢిల్లీ/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):లిలిసీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే తనను, తన కుటుంబ సభ్యులను భారతీయ జనతా పార్టీలో చేరాలని తీవ్రంగా బెదిరిస్తున్నారని ఆరోపించారు. పార్టీలో చేరకపోతే ప్రాణాలు తీస్తామని హెచ్చరికలు వస్తున్నాయని ఆయన తెలిపారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ అత్యున్నత స్థాయి అధికారుల నుంచే ఇలాంటి బెదిరింపులు రావడం ప్రజాస్వామ్యానికి ప్రమాద కరమని అభిజీత్ అన్నారు. ఇటీవల విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఘటనలకు కేంద్ర




## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎదురుచూపులు

### రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన చివరి విడత బిల్లుల చెల్లింపులు..

### పెరుగుతున్న అప్పులు, వడ్డీల భారం

నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వేలాది మంది లబ్ధిదారులు ప్రస్తుతం చివరి విడత బిల్లు కోసం ఎదురుచూస్తున్నారు. బేస్‌మెంట్, లింటెల్, రూఫ్ తదితర దశలకు సంబంధించిన బిల్లులు క్రమంగా మంజూరైనా, చివరి విడత నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధమైనా ప్రభుత్వం నుంచి రావాల్సిన చివరి బిల్లు జమ కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 2,493 ఇళ్లు పూర్తికాగా, 1,608 ఇళ్లు బేస్‌మెంట్ దశలో, 678 ఇళ్లు రూఫ్ దశలో ఉన్నాయి. అయితే పూర్తయిన ఇళ్లకు సంబంధించి నాలుగో విడత బిల్లులు పెండింగ్‌లో ఉండటమే ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారింది. దీంతో లబ్ధిదారులు నిర్మాణాల కోసం చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం నుంచి బిల్లులు సమయానికి వస్తాయనే నమ్మకంతో చాలామంది ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తీసుకుని సిమెంట్, ఇనుము, ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రి కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. కానీ చివరి విడత బిల్లు ఆలస్యం కావడంతో ప్రతి నెలా వడ్డీల భారం పెరుగుతుండటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

బిల్లుల చెల్లింపులో పారదర్శకత కోసం ప్రభుత్వం పూర్తిగా ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లేదా ఏఈలు నిర్మాణాలను పరిశీలించి జియోట్యాగ్ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం డీఈ పరిశీలించి ఆమోదం తెలుపగా, జిల్లా కలెక్టర్ తుది ఆమోదం ఇచ్చిన తర్వాత ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయికి చేరుతాయి. అక్కడ నుంచి నిధులు విడుదలైన వెంటనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతాయి.

ప్రస్తుతం చివరి విడత బిల్లుల విడుదల రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. నిధులు త్వరగా విడుదల చేస్తేనే అప్పుల ఊబి నుంచి బయటపడగలమని, వడ్డీల భారం తగ్గుతుందని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయి, జిల్లా స్థాయి ఆమోదం పొందిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా హౌసింగ్ అధికారులు తెలిపారు.

# డిజిటల్ తెర వెనుక రిజర్వేషన్ల నిర్వీర్య కుట్ర

## రిజర్వేషన్ల రక్షణకు ప్రగతిశీల శక్తులు ఏకం కావాలి!

### 'రిజర్వేషన్ హటావో' ప్రచారం వెనుక అధికార పక్ష కుట్రలు!

భారత రాజ్యాంగం అణగారిన వర్గాలకు ప్రసాదించిన సామాజిక సంరక్షణ కవచం 'రిజర్వేషన్లు'. అది ఏ ఒక్కరి దయాదాక్షిణ్యాలతోనో, పాలకుల ఉచిత భిక్షగానో లభించింది కాదు. శతాబ్దాల తరబడి సాగిన దారుణమైన సామాజిక వివక్షకు, అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అందించిన అత్యున్నత ప్రాథమిక హక్కు రిజర్వేషన్. అది కేవలం ఒక ఆర్థిక సహాయ పథకం ఎంతమాత్రమూ కాదు; ఈ దేశ పాలనలో, నిర్ణయాధికారాల్లో, విద్యా-ఉద్యోగ రంగాల్లో బహుజనులకు భాగస్వామ్యాన్ని, సమానత్వాన్ని కల్పించే చారిత్రాత్మక రక్షణ సూత్రం. అయితే, ఇటీవల సోషల్ మీడియా వేదికగా 'రిజర్వేషన్ హటావో ఆందోళన' (ఆర్‌హెచ్ ఏ) పేరిట పురుడు పోసుకున్న డిజిటల్ ప్రచారం కేవలం కొందరు నిరుద్యోగ యువత లేవనెత్తిన స్వచ్ఛంద స్వరం కానే కాదు. ఇది కులం ప్రస్తావనను, రిజర్వేషన్లను పూర్తిగా తొలగించాలనే విషపూరిత నినాదంతో సాగుతున్న పక్కా రాజకీయ కుట్ర అని పలువురు సామాజిక మేధావులు,
ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా మండిపడుతున్నారు.

మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతూనే, మరోవైపు శతాబ్దాల తరబడి అనుభవిస్తున్న అగ్రవర్ణ ఆధిపత్యం మరియు కుట్రలను కాపాడేందుకు పక్కా వ్యూహంతో ఈ డిజిటల్ ఉద్యమాలు సాగుతున్నాయని మేధావులు విమర్శిస్తున్నారు. ఐక్యత అనే ఆకర్షణీయమైన ముసుగు తొడిగి, లోలోపల మాత్రం ఎస్సీఎ,ఎస్టీ,బీసీ వర్గాలకు దక్కుతున్న చట్టబద్ధమైన రాజ్యాంగ హక్కులను లాక్కునేందుకు అగ్రవర్ణ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'కులం లేని సమాజం', 'ప్రతిభకే ప్రాధాన్యం (మెరిట్)' అనే భ్రమ కలిగించే పదజాలంతో అశాస్త్రీయ ప్రచారాన్ని నడుపుతూ అమాయక యువతను మభ్యపెట్టేందుకు ఈ 'ఆర్‌హెచ్‌ఏ' నెట్‌వర్క్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. సమాజంలో నిత్యం మూలమూలలా, చివరికి శ్మశానాల వరకు రాజ్యమేలుతున్న కుల వివక్షను, సామాజిక అసమానతలను నిర్మూలించకుండా, కేవలం అణగారిన వర్గాలు తమ హక్కులను అనుభవించే సమయంలో మాత్రమే 'కులాన్ని చూడవద్దు' అని మాట్లాడటం పరమ కపటత్వానికి నిదర్శనం.

ఈ తరహా కుట్రల వెనుక ఏ రాజకీయ శక్తులు ఉన్నాయనేది బహిరంగ రహస్యమే. నేరుగా ప్రజాక్షేత్రంలోకి వచ్చి గానీ, దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంటులో నిలబడి గానీ రాజ్యాంగాన్ని లేదా రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించే ధైర్యం ఏ రాజకీయ పార్టీకి లేదు. ఎందుకంటే దేశంలోని కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ఆగ్రహానికి గురైతే తమ రాజకీయ భవిష్యత్తు తుడిచిపెట్టుకుపోతుందనే భయం వారిని తీవ్రంగా వెంటాడుతోంది. అందుకే, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో 'బోట్' ఫాలోవర్లను, పెయిడ్ ప్రమోషన్లను కొనుగోలు చేసి, గంటల వ్యవధిలోనే మిలియన్ల మంది మద్దతు ఉన్నట్లు ఒక ఆర్టిఫిషియల్ హవాను సృష్టిస్తున్నారు. తద్వారా దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఒక మానసిక వాతావరణాన్ని, భావజాలాన్ని ప్రజల్లో నూరిపోసేందుకు అధికార పక్ష ప్రచార యంత్రాంగం, మనువాద శక్తులు తెరవెనుక ఉండి వైర్లు లాగుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.




మరోవైపు, దేశంలో నిరుద్యోగం పరాకాష్టకు చేరి, వరుస పేపర్ లీకేజీలతో యువత భవిష్యత్తు అంధకారమవుతుంటే, ద్రవ్యోల్బణంతో సామాన్యుడు నలిగిపోతుంటే... ప్రభుత్వం తన తీవ్ర వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రతిసారీ ఇటువంటి అత్యంత సున్నితమైన అంశాలను సోషల్ మీడియాలోకి వదులుతోంది. నిరుద్యోగ సమస్యకు అసలైన కారణం ప్రభుత్వం వద్ద సరైన ఉద్యోగ కల్పన విధానాలు లేకపోవడమే తప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కుతున్న రిజర్వేషన్లు కాదనే సత్యాన్ని తొక్కిపెడుతున్నారు. అగ్రవర్ణ పేదలకు ఇప్పటికే పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన తర్వాత కూడా, ఇంకా బహుజనుల వాటాను కబ్జా చేయాలనే దురాశతోనే ఇలాంటి ఉద్యమాలను డిజిటల్లో స్పాన్సర్ చేస్తు న్నారు. ఇది కేవలం ఒక్క రిజర్వేషన్లపై జరుగుతున్న దాడి మాత్రమే కాదు, ప్రత్యక్షంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిపై జరుగుతున్న కుట్ర.

చారిత్రకంగా చూస్తే, బహుజనులు విద్యాహక్కుకు దూరంగా ఉంచబడినప్పుడు ఈ 'ప్రతిభ' ఏమైంది? శతాబ్దాల పాటు సమాజంలోని సకల వనరులను అనుభవించిన వర్గాలు, నేడు కొన్ని దశాబ్దాల పాటు కల్పించిన ప్రాతినిధ్యం చూసి సహించలేకపోవడం వెనుక ఉన్నది కేవలం వర్ణాధిపత్య భావజాలం మాత్రమే. సామాజిక ప్రాతినిధ్యం లేని ప్రజాస్వామ్యం ఎప్పటికీ పరిపూర్ణం కాదు. ఉద్యోగాల్లో, సీట్లలో కేవలం మార్కులు మాత్రమే కొలమానం అయితే, అసమానతల పునాదులపై నిర్మితమైన సమాజంలో పేద, అణగారిన విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందనే ప్రశ్నకు ఈ 'రిజర్వేషన్ హటావో' సూత్రధారుల వద్ద సమాధానం లేదు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని, సామాజిక న్యాయ సూత్రాలను దెబ్బతీసేందుకు సాగుతున్న ఈ 'డిజిటల్ విప్లవం' పేరిట జరుగుతున్న కుట్రలను కేంద్ర ప్రభుత్వం, శాంతిభద్రతల విభాగాలు తక్షణమే అడ్డు కోవా లి. సామాజిక సమ తుల్యతను దెబ్బతీసేలా, కులాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేలా సాగుతున్న ఈ ప్రచారాల వెను క ఉన్న అసలు సూత్ర ధారులను, వారికి అందుతున్న విదేశీ లేదా రాజకీయ నిధులను తక్షణమే బయటపెట్టాలి. బహు జనుల శతాబ్దాల పోరాటాల ఫలితంగా, మహనీయుల త్యాగాల పునాదులపై సిద్ధించిన రిజర్వేషన్ల వ్యవస్థ జోలికి వస్తే ఈ దేశం ఊరుకోదు. ప్రగతిశీల శక్తులు, సామాజిక సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు మరియు విపక్షాలు తక్షణమే ఏకమై, డిజిటల్ ముసుగులో జరుగుతున్న ఈ రిజర్వేషన్ల వ్యతిరేక కుట్రను పటాపంచలు చేయాల్సిన అత్యంత ప్రధాన బాధ్యత ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863

## గండీరామన్న దత్తసాయి ఆలయ నూతన చైర్మన్‌గా కొట్టె శేఖర్ ప్రమాణ స్వీకారం



నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ గండీరామన్న దత్తసాయి ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా కొట్టె శేఖర్ గురువారం భక్తిశ్రద్ధలతో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్-ఛార్జ్ కూచాడి శ్రీహరి రావు ముఖ్య అతిథిగా హాజరై శేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ, ఆలయ సమగ్ర అభివృద్ధికి, భక్తులకు కనీస మౌలిక వసతుల కల్పనకు నూతన కమిటీ అంకితభావంతో పనిచేయాలన్నారు. పాలన పారదర్శకంగా సాగిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అత్యవసర వేళ ప్రజలకు ఉచిత వాహన సేవ: ముధోల్ ఉపసర్పంచ్ గడ్డం సుభాష్



ముధోల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముధోల్ మండల పరిధిలోని ప్రజలకు అత్యవసర ఆరోగ్య సమస్యలు ఎదురైతే ఉచితంగా రవాణా సౌకర్యం కల్పిస్తానని ముధోల్ ఉపసర్పంచ్, సామాజిక కార్యకర్త గడ్డం సుభాష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, గర్భిణీ స్త్రీలకు ప్రసవ అత్యవసర వేళల్లో రాత్రి పగలు తేడా లేకుండా తన సొంత వాహనంలో భైంసా లేదా సమీప ఆసుపత్రులకు ఉచితంగా తరలిస్తానని ప్రకటించారు. వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలు ధైర్యంగా ఉండాలన్నారు.

## బాసర బీసీ, ఎస్సీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్



బాసర, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను బాసర తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీఓ దేవేందర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి, పాఠశాల వంటశాలలను తనిఖీ చేశారు.

అనంతరం అధికారులే స్వయంగా విద్యార్థులతో కలిసి కింద కూర్చుని భోజనం చేసి రుచి చూశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, కాచి చల్లార్చిన నీటినే విద్యార్థులకు అందించాలని హాస్టల్ సంక్షేమ అధికారులను ఆదేశించారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం: కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి



ముధోల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఆధ్వర్యంలో రైతుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ ఎడ్బిడ్ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బ్యాగడి దత్తు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్ ఎంపికయ్యారు. సమావేశానికి హాజరైన కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. పంట నష్టపరిహారం, ప్రభుత్వ పథకాలు ప్రతి రైతుకు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విఠల్ రెడ్డి, రామగోపాల్ రెడ్డి, జంబుల సాయిప్రసాద్ పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### చింతకుంట పంచాయతీ సెక్రటరీ సుజాత



ముధోల్, జులై 30(తెలంగాణ వెన్నెల వాక్కు ):మూడు రోజుల్లో వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ముధోల్ మండలంలోని చింతకుంట గ్రామ ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని గ్రామపం చాయతీ కార్యదర్శి సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ యువకులు, గ్రామస్తులు చెరువులు వద్ద వెళ్ళరాదన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకి వెళ్ళకూడదని సూచించారు. విద్యుత్ స్తంభాలు వద్ద పాత ఇంట్లో జాగ్రత్త ఉండాలన్నారు. ప్రజలకు ఏవైనా ఇబ్బం దులు ఎదురైతే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.




# ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యానికి దూరం

తెలంగాణ వెన్నెల వాక్కు ప్రత్యేక కథనంలిలి
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఏర్పడింది. వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పులు, పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం, దోమల ఉద్ధృతి పెరగడం, కలుషిత నీటి వినియోగం వంటి కారణాలతో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, విరేచనాలు, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు ఈ కాలంలో ఎక్కువగా నమోదవుతుంటాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి అనారోగ్య సమస్యలను చాలా వరకు నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వర్షాలు కురిసిన తర్వాత ఇళ్ల చుట్టుపక్కల, ఖాళీ స్థలాలు, పాత టైర్లు, కుండీలు, డబ్బాలు, నీటి ట్యాంకులు, కాలువల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఇవే డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులకు కారణమవుతాయి. అందువల్ల ప్రతి కుటుంబం వారానికి కనీసం ఒకసారి ఇంటి పరిసరాలను పరిశీలించి నిల్వ నీటిని తొలగించడం, కాలువలను శుభ్రంగా ఉంచడం, దోమతెరలు, దోమల నివారణ పరికరాలను ఉపయోగించడం అవసరం. సాయంత్రం వేళల్లో పూర్తి చేతుల దుస్తులు ధరించడం ద్వారా కూడా దోమల కాటుకు దూరంగా ఉండవచ్చు.

వర్షాకాలంలో తాగునీటి విషయంలో కూడా అత్యంత అప్రమత్తంగా ఉండాలి. కలుషిత నీటిని తాగడం వల్ల విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. తాగునీటిని తప్పనిసరిగా కాచి చల్లార్చి తీసుకోవడం, నీటి పాత్రలను మూతపెట్టి ఉంచడం, చేతులను తరచుగా సబ్బుతో శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఆహార విషయంలో కూడా నిర్లక్ష్యం చేయరాదు. బయట విక్రయించే అపరిశుభ్రమైన ఆహారం, ఎక్కువసేపు నిల్వ ఉంచిన పదార్థాలు, తెరిచి ఉంచిన తినుబండారాలు తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజనింగ్‌తో పాటు పలు జీర్ణ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇంట్లో తాజాగా తయారు చేసిన వేడి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి ఉపయోగించడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కళ్ల వెనుక నొప్పి, తీవ్రమైన నీరసం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వెంటనే సమీప ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. సాధారణ జ్వరమని నిర్లక్ష్యం చేస్తే కొన్నిసార్లు వ్యాధి తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

వర్షాకాల వ్యాధులను అరికట్టడంలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడడం, దోమల నివారణ చర్యలకు సహకరించడం, ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే వర్షాకాలాన్ని ఆరోగ్యవంతంగా గడపడం సాధ్యమవుతుంది.

# నిర్మల్ జిల్లాలో 100 శాతం ఎస్ఐఆర్ పూర్తి



నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లాలో ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలను ఆదిలాబాద్ పార్లమెంటరీ ఎస్ఐఆర్ ఇన్-ఛార్జ్ ఆరే పల్లి మోహన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్ అభినందించారు. గురువారం నిర్మల్ పట్టణంలోని మారుతి ఇన్ హోటల్లో నిర్వహించిన బిఎల్ఏ పరిశీలన సమావేశంలో నిర్మల్ నియోజకవర్గ ఇన్-ఛార్జ్ కూచాడి శ్రీహరి రావుతో కలిసి వారు మాట్లాడారు. ఆగస్టు 12, 13 తేదీలలో ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ డిక్లరేషన్ విడుదలవుతుందని, అందులో పొరపాట్లు ఉంటే సరిచేసుకుని తొలగిపోయిన ఓట్లను తిరిగి నమోదు చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, పిసిసి ప్రధాన కార్యదర్శి అంబడి రాజేశ్వర్ పాల్గొన్నారు.

# ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల



ఖానాపూర్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌ను నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వర్టికల్ రికార్డులు, మాల్ఖానా, సీసీ కెమెరాల పనితీరు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారులకు కేసుల విచారణపై పలు దిశానిర్దేశాలు చేశారు. బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వేగవంతంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తూ నిరంతరం రాత్రి గస్తీ ముమ్మరం చేయాలన్నారు. వర్షాల దృష్ట్యా ప్రమాదకర లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రాహుల్ పాల్గొన్నారు.

# గోదావరిలో చేపల వేటపై పూర్తి నిషేధం



నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): భారీ వర్షాలు, వరదల తీవ్రత దృష్ట్యా నిర్మల్ జిల్లాలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, కాలువలు, చెరువులలో చేపల వేటను పూర్తిగా నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మత్స్యకారులు, జాలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లరాదన్నారు. చెరువులు, కాలువల వద్ద వేసిన జాలిలు, వలలను తక్షణమే తొలగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే మత్స్యకారుల లైసెన్సులు, సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల ద్వారా దండోరా (టామ్ టామ్) వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

## విద్యా రంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

కేవలం 55 రోజుల్లో భర్తీ చేశామని గుర్తు చేశారు.
విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యతో పాటు స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అమెరికాతో పాటు జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, సింగపూర్, చైనా వంటి దేశాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని విద్యా విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భాషతో పాటు నైపుణ్యాలు ఉంటే విదేశాల్లో లక్షల రూపాయల వేతనాలతో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు తాత్కాలిక ఉపశమనం మాత్రమే ఇస్తాయని, పేద కుటుంబాల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురాగలిగేది విద్య మాత్రమేనని సీఎం పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒక డాక్టర్ లేదా ఇంజనీర్‌ను తయారు చేయగల శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు 9 శాతం నిధులు విద్యా రంగానికి కేటాయిస్తున్నామని, రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులపై ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.1.08 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత మూడేళ్లుగా అడ్మిషన్లు పెరుగుతున్నాయని, ఈ విద్యా సంవత్సరంలో లక్షకు పైగా కొత్త చేరికలు నమోదయ్యాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభించడంతో పాటు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన సంస్కరణలపై డిసెంబర్‌లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలాన్ని ఒక విద్యా క్లస్టర్‌గా అభివృద్ధి చేసి నూతన విద్యా ప్రణాళికను అమలు చేయాలని సూచించారు.

# వాగుల వద్దకు వెళ్లొద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తానూర్, జూలై 30 తెలంగాణ వెన్నెల వాక్కు తానూర్ మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు ఉధృతం గా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తానూర్ ఎస్సై షేక్ జుబేర్ సూచించారు. వాగులు, చెరువులు, కాలువల వద్దకు సరదా కోసం వెళ్లడం, సెల్ఫీలు దిగడం, వీడియోలు చిత్రీకరించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరం గా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహాలను చూసేందుకు గుంపులుగా వెళ్లడం కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వాగులు, చెరువులు, నీటి ప్రాంతాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. అలాగే భారీ వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉన్నందున వాటికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఎస్సై షేక్ జుబేర్ కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాలతో కడెం ప్రాజెక్టుకు వరద పోటు: క్షేత్రస్థాయిలో ఎస్పీ పరిశీలన!

- అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులతో కలిసి నీటి మట్టాలు, భద్రతా ఏర్పాట్ల సమీక్ష
- ప్రమాదకరమైన వాగులు, చెరువుల వద్దకు ప్రజలు, పశువుల కాపరులు వెళ్లవద్దు: ఎస్పీ జానకి షర్మిల



నిర్మల్/కడెం, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాల నేపథ్యంలో నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల గురువారం కడెం ప్రాజెక్టును నేరుగా సందర్శించి వరద పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో నీటి మట్టాలు, గేట్ల నిర్వహణ, లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణ మరియు భద్రతా ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లుతో కలిసి ఇంజనీరింగ్ అధికారు లతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

సెల్ఫీలు, వీడియోల కొరకు జలాశయాల వద్దకు వెళ్లరాదు:
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రెండు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున ప్రజలందరూ తీవ్ర అప్రమత్తతతో ఉండాలన్నారు. కడెం ప్రాజెక్టుతో పాటు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు దాటేందుకు ఎవరూ సాహసించవద్దని, ప్రమాదకరమైన ప్రవాహాల వద్ద సెల్ఫీలు, వీడియోలు తీయకూడదని స్పష్టం చేశారు. పాత భవనాలు, గుడిసెలలో నివసించే వారు సురక్షిత ప్రాంతా లకు వెళ్లాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బ్లూకోల్ట్స్, పెట్రో కార్లు సేవలు అందిస్తాయ న్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పిడీ విజయ లక్ష్మి, డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనా రాయణ, ప్రాజెక్టు ఈఈ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ముధోల్ నియోజకవర్గాన్ని ముంచెత్తుతున్న వానలు: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి!

- పొంగిపొర్లుతున్న వాగులు.. జలమయమైన పత్తి, సోయాబీన్ పంట చేన్లు
- అత్యవసర సహాయం కొరకు నేరుగా తనను సంప్రదించాలి: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ముధోల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షాలు దంచికొట్టాయి. ముధోల్ మండలంతో పాటు భైంసా, కుబీర్, కుంటాల, లోకేశ్వరం, తానూర్ మండలాల్లో వర్షపు నీరు రహదారులు, పంట పొలాలను ముంచెత్తింది. పలు గ్రామాల్లో పత్తి, సోయాబీన్ పంట చేన్లలో నీరు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు దెబ్బతిని సాధారణ జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది.

అధికార యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉండాలి:
పరిస్థితి తీవ్రతపై ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పందిస్తూ, ప్రజలు ఎవరూ అధైర్యపడవద్దని, అత్యవసర పరిస్థితుల్లో నేరుగా తనను గానీ, అధికారులను గానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలోనే పర్యవేక్షించాలని ఆదేశించారు. వాగులు ఉప్పొంగుతున్నందున పిల్లలను బయటకు పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ముద్గల్ వంతెన వద్ద ప్రవాహాన్ని పరిశీలించిన ఎంపీడీఓ లవకుమార్ రాకపోకలను నిలిపివేసి ముళ్ల పొదలు ఏర్పాటు చేశారు.

# ఆర్జీయూకేటీ బాసర్‌లో పీయూసీ-× ఓరియంటేషన్ కార్యక్రమం ప్రారంభం!




బాసర, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో (ఆర్జీయూకేటీ) నూతనంగా ప్రవేశం పొందిన పీయూసీ-× విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం-2026 గురువారం అత్యంత స్ఫూర్తి దాయకంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎం.ఎల్. సాయి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, నైతిక విలువలు, నిరంతర శ్రమతో వాటిని సాధించాలని పిలుపునిచ్చారు.

క్యాంపస్ సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవాలి:
ఆర్జీయూకేటీలో అందుబాటులో ఉన్న నూతన ప్రయోగశాలలు, డిజిటల్ వనరులు, పరిశోధనా అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలుగా తీర్చిదిద్దడమే బాసర ట్రిపుల్ ఐటీ ప్రధాన ధ్యేయమన్నారు. అకాడమిక్స్‌తో పాటు ఆవిష్కరణల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఓరియంటేషన్ సమన్వయకర్త డాక్టర్ గుజ్జరి శంకర్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలో నిషేధం అమల్లో ఉన్నప్పటికీ నిర్మల్ జిల్లాలో గుట్కా, తంబాకు, ఖైనీ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి భారీ ఎత్తున నిషేధిత ఉత్పత్తులు జిల్లాలోకి చేరుతున్నాయని, అక్కడి నుంచి పట్టణాలు, గ్రామాల్లోని పాన్ షాపులు, కిరాణా దుకాణాల ద్వారా రహస్యంగా విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ వ్యాపారం వల్ల ముఖ్యంగా యువత ఆరోగ్యం ప్రమాదంలో పడుతుండగా, సంబంధిత శాఖల తనిఖీలు మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉండటాన్ని ఆసరాగా చేసుకుని నాందేడ్, కిన్వట్, ధర్మాబాద్, భోకర్ ప్రాంతాల నుంచి లారీలు, ప్రైవేట్ వాహనాలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా గుట్కా ప్యాకెట్లు రహస్యంగా తరలిస్తున్నట్లు సమాచారం. కుభీర్, భైంసా, తానూర్, లోకేశ్వరం, ముధోల్ మీదుగా నిర్మల్, ఖానాపూర్, దస్తూరాబాద్ ప్రాంతాలకు చేరిన సరుకును అక్కడి నుంచి చిన్న వ్యాపారులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. నిషేధిత ఉత్పత్తులు కావడంతో సాధారణ ధర కంటే పలుమార్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అధిక లాభాలు రావడంతో ఈ అక్రమ వ్యాపారం మరింత విస్తరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ఈ మత్తు పదార్థాలు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల సమీపంలోని కొన్ని పాన్ షాపుల్లో సైతం అందుబాటులో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. చిన్న వయసులోనే విద్యార్థులు, యువకులు వీటికి అలవాటు పడుతూ నోటి క్యాన్సర్‌తో పాటు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి గుట్కా రవాణాపై చర్యలు తీసుకున్నప్పటికీ ప్రస్తుతం సరిహద్దు ప్రాంతాల్లో మరింత పటిష్టమైన నిఘా అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించడం, గోదాములు, పాన్ షాపులపై ఆకస్మిక దాడులు చేపట్టడం, అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఈ నల్లదందాకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు కోరుతున్నారు.

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దంచి కొడుతున్న వర్షాలు: కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్!



నిర్మల్/ముధోల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో పాటు ప్రాజెక్టులలోకి, వాగుల్లోకి ప్రవాహాలు ఉధృతంగా వచ్చి చేరుతున్నాయి. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల రక్షణ కొరకు నిర్మల్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఒక రోజు అధికారిక సెలవు ప్రకటించారు.
వరద బాధితులు, అత్యవసర సాయం కొరకు కలెక్టరేట్ లో 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ (9100577132) ఏర్పాటు చేశారు. వర్షపు నీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని ముధోల్, తానూర్ మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువుల కాపరులు, జాలర్లు, ప్రజలు వాగులు, గోదావరి నది పరివాహక ప్రాంతాల వైపు వెళ్లవద్దని తహసీల్దార్లు శ్రీలత, పవన్ చంద్ర ఆదేశించారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న ఝరి (బి) వాగు: క్షేత్రస్థాయిలో తహసీల్దార్ తనిఖీ



తానూర్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూర్ మండలం ఝరి (బి) గ్రామంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి స్థానిక వాగు ఉ అప్పొంగి ఉధృతంగా ప్రవహించింది. వర్షపు నీరు ఒక్కసారిగా రహదారిపైకి చేరడంతో ఝరి గ్రామానికి రవాణా సంబంధాలు, రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న తానూర్ తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీఓ శ్రీధర్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ వాగు వద్దకు చేరుకుని క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.
వాగు దాటేందుకు ఎవరూ సాహసించవద్దని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా వాగుకు ఇరువైపులా నిఘా ఉంచి, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రగతి బాటలో దిలావర్‌పూర్!

### – నిధులు, పనుల ప్రగతిపై సుదీర్ఘ సమీక్ష..
### – అధికారుల గైర్హాజరీపై సర్వసభ్య సభ తీవ్ర అసంతృప్తి

దిలావర్‌పూర్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పేదవాడికి చేరినప్పుడే మండల పురోగతి సాధ్యమవుతుందని, అధికారులు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అంకితభావంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి రాథోడ్ రమేష్ సూచించారు. గురువారం దిలావర్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ అరుణ అధ్యక్షతన 'మండల సర్వసభ్య సమావేశం' అత్యంత ప్రాధాన్యతాంశాలతో సుదీర్ఘంగా జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో మండల పరిధిలోని పలు శాఖల అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధుల నడుమ లోతైన చర్చ సాగింది.




**విద్యా, వైద్య రంగాల్లో సరికొత్త రికార్డులు:**
ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా నిర్వహించిన సమీక్షల్లో దిలావర్‌పూర్ మండలం సాధించిన ఉత్తమ ఫలితాలను అధికారులు వెల్లడించారు. మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు శాతంలో దిలావర్‌పూర్ మండల పరిధిలోని 10 ప్రభుత్వ పాఠశాలలు నిర్మల్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలిచాయని ప్రత్యేక అధికారి కొనియాడారు. ప్రభుత్వ బడులలో 1 నుండి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం బోధనను సమర్థవంతంగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజన నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని ఎంఈఓ పర్స సదానందంను ఆదేశించారు. ఇక వైద్యారోగ్య రంగంలోనూ పల్స్ పోలియో, చిన్న పిల్లలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ పంపిణీ ప్రక్రియలో దిలావర్‌పూర్ మండలం జిల్లా స్థాయిలోనే రెండో స్థానాన్ని దక్కించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో "డ్రై డే" పాటించాలని నిర్ణయించారు.
**భూగర్భ జలాల పెంపునకు 60 ఫామ్ పాండ్‌లు:**
మండలంలో ఉపాధి హామీ పథకం కింద 7,021 జాబ్ కార్డులు కలిగిన 6,610 మంది కూలీలకు నిరంతరం పనిదినాలు కల్పిస్తున్నామని తెలిపారు. బిఎన్ పల్లి గ్రామంలో మంజూరైన 42 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకుని బేస్‌మెంట్, రూఫ్ లెవెల్ పనులను వేగవంతం చేయించాలన్నారు. ఎల్ నినో వాతావరణ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు పడిపోకుండా మండల వ్యాప్తంగా ప్రతి గ్రామానికి 10 చొప్పున మొత్తం 60 ఫామ్ పాండ్‌లను (రైతు కుంటలు) తవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే వరికి ప్రత్యామ్నాయంగా 10 ఎకరాల్లో పామాయిల్ సాగును ప్రోత్సహించాలని, రైతులు రసాయనాల వాడకం తగ్గించి సేంద్రీయ సాగు వైపు మళ్లాలని కోరారు.
అధికారుల గైర్హాజరీపై సర్వసభ్య సభ సీరియస్:
ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత కీలకమైన ప్రజాప్రతినిధుల సర్వసభ్య సమావేశానికి పశుసంవర్ధక, అటవీ, మత్స్యశాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు, సభ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలకు నివేదిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ షేక్ అజాజ్ ఖాన్, ఎంఈఓ పి. సదానందం, ఏపీఓ రమణ, ఎంపీఓ గోవర్ధన్, పిఎసిఎస్ చైర్మన్ పి.వి. రమణారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శివ, ఇరిగేషన్ అధికారి గంగాధర్, రీఛార్జ్ ప్లాన్ అధికారి రాజశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సోఫీనగర్‌లో ముంపు నీటి సమస్యకు పరిష్కారం: వైస్ చైర్మన్ చొరవ



నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని 14వ వార్డు సోఫీనగర్ కాలనీలో కురిసిన వర్షాలకు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే స్పందించి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న 15 పాత పైపులను యంత్రాలతో తొలగించారు.
డ్రైనేజీ ప్రవాహానికి అడ్డంకులు తొలగించడంతో వరద నీరు సాఫీగా వెళ్లి స్థానిక ప్రజలకు పెద్ద ఉపశమనం లభించింది. కాలనీల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్షియా తబస్సుమ్, డిఈ హరిభువన్ పాల్గొన్నారు.

## గాయత్రిపురం, సిద్ధాపూర్ వరద ప్రాంతాల్లో సయ్యద్ హైదర్ పర్యటన

నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నిర్మల్ పట్టణ పరిధిలోని గాయత్రిపురం, సిద్ధాపూర్ కాలనీల్లో గురువారం తెలంగాణ జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ పర్యటించి వరద ముంపు పరిస్థితులను పరిశీలించారు. నిర్మల్ తహసీల్దార్ ప్రభాకర్ తో కలిసి వెళ్లి ఇళ్ల పరిసరాలను, డ్రైనేజీలను తనిఖీ చేశారు.
ఏటా వర్షాకాలంలో ఈ కాలనీలు నీట మునుగుతున్నందున ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గాయత్రిపురంలో ముంపు నివారణకు శాశ్వత పరిష్కారంగా 20 నుండి 30 అడుగుల వెడల్పుతో కల్వర్టులు లేదా బ్రిడ్జిలు నిర్మించాలని సయ్యద్ హైదర్ విజ్ఞప్తి చేశారు.



## స్కావెంజర్లకు కనీస వేతనం పెంచాలి: సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్




నిర్మల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పాఠశాలల్లో అత్యంత క్లిష్టమైన పారిశుధ్య పనులు చేస్తున్న స్కావెంజర్స్ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరానగర్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.
కార్మికుల వేతనాలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, హాజరు విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. అనంతరం 15 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గంగాధర్, అధ్యక్షుడిగా నారాయణ, కార్యదర్శిగా మల్లేష్ ఎంపికయ్యారు.

## వడ్తల రోడ్లపై నిలిచిన వర్షపు నీటి పూడ్చివేత పనులు:



ముధోల్, జూలై 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామంలోని రోడ్లు చిత్తడి గా మారి ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వడ్తల సర్పంచ్ రమేష్, కార్యదర్శి సురేష్ తెలిపారు. గురువారం వారు వడ్తల గ్రామంలోని ప్రధాన రహదారులపై నీరు నిలిచిన గుంతలను పూడ్చే పనులను దగ్గరుండి పరిశీలించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులతో గుంతలలోని నీటిని తొలగించి మట్టి తో నింపే పనులను ముమ్మరం చేశామన్నారు. గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులు చేపడుతున్నామని, పరిసరాలు శుభ్రం గా ఉంచేందుకు ప్రజలు పంచాయతీకి సహకరించాలని కోరారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com